బహుభార్యాత్వాన్ని పూర్తిగా
తరిమివేయాలని పట్టుపట్టింది

# ★ సుశీలకు నా ధన్యవాదాలు

—బూ. రం. రావు బి. ఏ.—

మానవ జీవితం ఒక రైలు ప్రయాణంలాంటిది; అందులో ముఖ్యంగా దాంపత్య జీవితం. ఈ పందొమ్మిదిశతాబ్దాల నలభైలోగూడా, హిందూ సమాజంలో ఇంకా ఆకస్మికమైన, నిర్హేతుకమైన వివాహాలు జరుగుతున్నాయి. శుభాంతంగా పరిణమించేవి చాలా అరుదు. అంతం ఎలాగున్నా బ్రతికి ఉన్నన్ని రోజులు భార్యాభర్తలు అనుకూలంగా గడపడంకూడా గొప్ప భాగ్యమే. అసమ వివాహాలు ఒక్కొక్కప్పుడు అసమంగానే ఉంటాయి. కొన్ని దారుణంగా పరిణమిస్తాయి...

మా దాంపత్యంకూడా దారుణం కాకపోయినా అనుచితమైంది. ప్రభ రూపసి. స్కూల్ ఫైనల్ ప్యాసయింది. నామీద ప్రేమలేదని చెప్పటానికి వీలులేదు. ముఖంమీద ఎప్పుడూ అజ్ఞానం కనపడుతూ ఉంటుంది. కుఱ్ఱతనం తాండవిస్తూ ఉంటుంది. వయసు పద్దెనిమిదేండ్లు. పొట్టిగా బక్కగా ఉంటుంది. నాకూ మొదట ప్రభమీద వ్యామోహం ఉంది చెప్పొద్దూ,...కాని......

మొట్టమొదట ప్రభ ముఖంమీద కనుపడిన అజ్ఞానం ఇప్పుడు మూర్ఖత్వంగా మారింది నాకళ్లకు. ఆమె మితభాషణ, శుశ్రూష, నామీది భక్తిశ్రద్ధలు, ప్రేమ మొదట ప్రణయోన్మత్తుణ్ణి చేసేవి. ఇప్పుడు ఉన్మాదుణ్ణిగా చేస్తున్నాయి.

ఎంత చదువుకున్నా అదేమిటో ఆమెలో మూర్ఖత్వం మూర్తీభవించింది. ఆ ఎఱ్ఱని పెదిమలలో ఆనందం కనబడదు. తీర్చిన కనుబొమ్మల్లో, విశాల నేత్రాల్లో ఆకర్షణశక్తిలేదు. ఇప్పటికీ ఆమెను ఎంతోమంది అందగత్తె అంటారు. నేను అదృష్టవంతుణ్ణని కొందరు 'చాటుకూ, నేటుకూ' అసూయపడతారు. నా అసంతృప్తి వాళ్లకి తెలిస్తేగా!

బెంగాలీవాళ్లను, హైందవసభ్యతా స్వీకృతులైన ఆంగ్లో ఇండియన్లను, పార్సీ పడుచువాళ్లను చూస్తే నాహృదయం తరుక్కుపొయ్యేది. పొడుగ్గా, సన్నంగా, నాజుగ్గా పాలప్రవాహాల్లాంటి చేతులు, చాకచక్యాన్నంతా ప్రతిఫలింపజేసే వాళ్లకళ్లు చూస్తే నాగుండెలవిసిపొయ్యేవి... 'నాకీ నిర్భాగ్యదేవత ఎందుకు లభించిందా? ఎంత పాపంచేశానో' అనిపించేది. ఇంక ఇతరకారణాలేవీలేవు. ప్రభ పొడుగ్గా లేకపోవడం, ఉత్సాహంగా ఒత్తుకు తిరగడం (pushing nature) చాతగాకపోవడమే నా కామెమీద అయిష్టం కలిగించాయి. ఆ అయిష్టాన్ని నెమరువేసి నెమరువేసి...అసహ్యంకిందికి దిగింది. ఎలా ప్రభను వదిలించుకోవడం? ఎలా ఆమెమీద, ఆమె వాళ్ళమీద నాపగ తీర్చుకోవడం?...పునర్వివాహానికి పూనుకోవటం అతి సులంభం, అత్యుత్తమంగా తోచింది...

పునర్వివాహ ప్రయత్నం చేశాను. చాలామంది తమ అమ్మాయిలను ఇస్తామన్నారు. కాని 'తుంటెవిడిచి మొద్దును కట్టుకోగూడద'ని, నా ఆశయాలప్రకారం తగిన వధువు కష్టంమీద దొరికింది. ఇంగ్లీషుమాత్రం రాదు. అందంగా పొడుగ్గా చాలాకీగానే ఉన్నది. సంగీతం బాగావచ్చు. ఆ అమ్మాయికి పన్నెండేళ్ళకే తెలుగులో మంచి పాండిత్యం వచ్చిందంటే ఇహ ఇంగ్లీషు ఒక సంవత్సరంలో బాహాటంగా నేర్పుకోవచ్చునుకుని ఆమెను పెళ్లిచేసుకున్నాను.

ఎలాగైతేనేం సుశీల మా ఇంటి కొచ్చేసింది.........ఓపికతో నాలుగేళ్లు పట్నంలో మహిళా విద్యాలయంలో వుంచి చదువుచెప్పించాను. ఈ నాలుగేళ్లలో సుశీల బాగా ఇంగ్లీషు నేర్చుకుంది. నా అదృష్టవశాత్తు పాశ్చాత్య దుర్గుణాలామెకు అలవాటుపడలేదు. సత్సాంగత్యంవల్ల ఇంగ్లీషు చదువుకున్న ఆమెదృష్టి విశాలమైపోయింది. సంఘసంస్కరణమీద ఆమెహృదయం లగ్నమైంది. స్త్రీ జనాభ్యుదయం కోసం ఆమె సర్వశక్తులూ ప్రవాహాలవలె పొంగి పొయ్యాయి. శ్రీమతులు సరోజినినాయుడు, కమలా నేహ్రూ, విజయలక్ష్మీపండిట్, దుర్గాబాయమ్మ ఆత్మతేజ మీ మెలోగూడా ప్రకాశించిది.

అందం, జాగ్రత్త, తెలివితేటలూ, అన్నీ నాకుకావలసినవే దొరికాయి-కాని నాకు శాంతిలేదు. తృప్తిలేదు. కారణం? నేను ముఖ్యంగా నా మనస్ఫూర్తిగాకోరింది - నిజంచెప్పవలసివస్తే - ఇంగ్లీషు విద్య వల్ల వచ్చే నాగరికత, ఫాషన్, ఒత్తుకు తిరగడం, నిర్లక్ష్యం, ఒకముక్కలో పాశ్చాత్య వ్యామోహం... నాకు కావలసిఉంది. సభలో ఉపన్యాసాలివ్వడమే గాని తత్ప్రకారంచేతామనే పట్టుదలగాదు. ఇలాగే అంతే. (Shyprocrisy, Superficiality Vanity) చెప్పేదొకటి చేసేదొకటి, బుడబుడక్కల వేషాలు, స్వాతిశయం...ఇలాంటివి. ఈ దుర్గుణ పుంజాన్ని కడుపునపెట్టుకొ, మీదికిమాత్రం టాయిలెటు వాసనలు ఘుమ ఘుమా యిస్తుంటే, పెదవులమీదలేని చిరునవ్వు తొణుకాడు తూండగా గోముఖవ్యాఘ్రంవలె ఉండాలని... ఇలాటివి ప్రభలోలేవనే, సుశీలను చేసుకున్నాను ...

కాని సుశీల సుశీలయే అయ్యింది. ఎంత ఆధునిక సభ్యతా సంపర్కమున్నా ఆమెమాత్రం క్రియలో, అనుష్ఠానంలో నిజంగా హైందవనారీమతల్లుల పవిత్రాత్మశక్తిని జొప్పించింది. ఈ శక్తి ఏకముఖమై ప్రప్రథమంలో నామైన్నే ప్రయోగించింది. నేను తననెందుకు పెళ్లాడానో తెలుసుకుంది. నా అవివేకానికి నొచ్చుకుంది. బహుభార్యాత్వము మొదట తన ఇంటినుండి తరిమవేసి తరువాత పొరుగిళ్లనుండి, దేశాన్నుంచి తరిమేయాలని పట్టుపట్టింది.

శలవులిచ్చారు. మా ఇంటికివచ్చింది సుశీల. మా ఇంట్లో నేనూ ప్రభ ఉన్నాం. సుశీల తీరాచదువై వచ్చిందాకా ప్రభతోఉండి తరువాత ఆమెను పంపివెయ్యాలను కున్నాను......సుశీలకు ఎప్పుడెలా మాట్లాడాలో బాగాతెలుసు. అంచేత ఒకరోజు అవకాశంచూసి, ఉన్నట్టు ఉండే 'మీరు మాఇద్దర్లో ఎవ్వరినో ఒక్కర్నిమాత్రమే పెళ్లాడాలె. అన్నివిధాలా మీకు ప్రభే తగింది. మొదలు ఆమెను పెళ్లిచేసు కున్నారు. ఇప్పుడామెనే ఉంటే బావుంటుంది. కచ్చితంగా చెప్పండి' అంది రోషం కళ్లలో ప్రతి ఫలిస్తూండగా. నేను నిలువునా నీరైపోయాను. వెంటనే అందుకున్నది 'మీకు ప్రభ ఇష్టంలేకపోతే, ఆమెకునేను పునర్వివాహం చేస్తాను. ప్రభ ఒప్పుకుంది'. చాటున ప్రభకు ఏం చెప్పి వప్పించిందో ఇద్దరు ఏం మాట్లాడుకున్నారో? ప్రభకోసం సుశీల తాను త్యాగంచేయాలనుకుంది. ప్రభను నాకు విడిచిపెడ్తే దౌర్జన్యంచేసి ఆమెమీద ఈపగ ఆపగ సాధిస్తానని తానే నన్ను పెళ్లాడవప్పుకున్నది. మన సంఘంలోని దురాచారాలను గురించి, నాలాటి స్వార్థపరుల గూర్చి ఒకపెద్ద ఉపన్యాసం విసిరింది ఎంతో చాకచక్యంతో, ఉద్రేకంతో. నా కళ్లలోనుంచి పటపట నీళ్లు దూకాయి. అజ్ఞాన తమోజీమూతాలు పటాపంచలయ్యాయి. ఆ పశ్చాత్తాపపు అశ్రుపాతంతో నా వ్యామోహం, నా మూఢ్యం, నా పాపం అంతా, సుశీల పవిత్ర తేజంలో దగ్ధమైపోయాయి. సుశీలకు నేను తగకపోగా ఆమెనాకు దేవతలా కనపడింది. ఇహ ఆమెతో దాంపత్యంపొసగదు. ప్రభ అనుమతిమీద, నేను ప్రభనే ఇప్పుడు పవిత్రవివాహం చేసుకున్నాను. •

సుశీలకు నా మనః పూర్వకమైన ధన్యవాదాలు.